
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 22 మే 2025



# కర్షకుల్లో కలవరం..

- ఒకవైపు ఉక్కపోత.. మరోవైపు ఉరుములు, మెరుపుల వాన
- జడివానతో తడిసిన ధాన్యం
- త్వరగా కొనుగోలు చేయాలని రైతుల ఆందోళనలు



గంభీరావుపేట మండలం కొత్తపల్లి కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురుస్తున్న అకాల వర్షాలు కర్షకులను కలవర పెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధ వారం సాయంత్రం వరకు వర్షపు జల్లులు జడివానగా మరికొన్ని చోట్ల కురవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యంతో దిగాలు పడుతున్నారు. వాతావరణంలో ఒకవైపు మార్పులు వచ్చి 40గరిష్ట డిగ్రీల కంటే తక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా ఉక్కపోత మాత్రం వదలడం లేదు. బుధవారం సరాసరి 20.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 25.3, చందుర్తిలో 35.9. వేములవాడ రూరల్‌లో 9.0, బోయినపల్లిలో 12.9, వేములవాడలో 23.1, సిరిసిల్లలో 16.3, కోనరావుపేటలో 40.6, ఎల్లారెడ్డిపేటలో 15.3, వీర్నపల్లిలో 35.3, ముస్తాబాద్‌లో 4.9, గంభీరావు పేటలో 22.3, ఇల్లంతకుంటలో 12.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి బోయినపల్లి, వీర్నపల్లి, చందుర్తి, కోనరావుపేట, సిరిసిల్ల, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యంతో పాటు ఉరుములు, మెరుపులతో పిడుగులు పడడంతో పొలాలవద్ద ఉన్న పశువులు చనిపోతున్నాయి. వర్షాల పరిస్థితి అంతు చిక్కక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**● 74 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి...**

యాసంగి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 244 కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ప్రారంభించింది. ఇందులో 74 కేంద్రాల్లో కొనుగోళ్లను పూర్తి చేసింది. ఐకేపీ ద్వారా 190 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించి 62 కేంద్రాల్లో పూర్తి చేశారు. సింగిల్‌విండోలో 44 కేంద్రాల్లో 8 కేంద్రాలు, మెప్మాలో 7 కేంద్రాల్లో 4 కేంద్రాల్లో పూర్తి చేసి కేంద్రాలు మూసివేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటా వేయకపోవడం, మిల్లులకు తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతూ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు.

**● జిల్లాలో 2.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

జిల్లాలో యాసంగిలో 1.78 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డురకం, 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకం వస్తుందని అంచనాలు వేసి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇప్పటివరకు పౌరసరఫరాల శాఖ 2.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఐకేపీ ద్వారా 1,69,996 మెట్రిక్ టన్నులు, సింగిల్‌విండోల ద్వారా 45,124 మెట్రిక్ టన్నులు, డీసీ ఎంఎస్ ద్వారా 2276 మెట్రిక్ టన్నులు మెప్మా ద్వారా 5,291 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేశారు.

**● రైతుల ఖాతాల్లో రూ.347.71 కోట్లు**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటవెంటనే జమచేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఇప్పటి వరకు 33,072 మంది రైతుల నుంచి రూ.516.64 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. ఇందులో 27,248 మంది రైతులకు సంబంధించి 1,75,029 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.406.07 కోట్లు ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్ చేసిన వాటిలో 24,385 రైతులకు సంబంధించి 1,49,875 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.347.71 కోట్లు జమ చేశారు. ఇందులో ఐకేపీ ద్వారా 25,736 మంది రైతుల నుంచి రూ.394.39 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా 19,592 మంది రైతుల ఖాతాల్లో రూ.272.89 కోట్లు, సింగిల్ విండోల ద్వారా 6,401 మంది రైతుల నుంచి రూ.104.69 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి 4,153 మంది రైతుల ఖాతాల్లో రూ.63.57 కోట్లు, డీసీఎంఎస్ ద్వారా 261 మంది రైతుల నుంచి రూ.5.28 కోట్ల విలువైన ధాన్యంకు సంబంధించి 184 మంది రైతుల ఖాతాల్లో రూ.3.13 కోట్లు, మెప్మా ద్వారా 674 మంది రైతుల నుంచి రూ.12.28కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి 456 మంది రైతుల ఖాతాల్లో రూ.8.12 కోట్లు జమ చేశారు. అకాల వర్షాల దృష్ట్యా వేగంగా కొనుగోలు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

## నేడు మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో గురువారం మ్యాదర్శి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ మనోహర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**- సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్**



దరఖాస్తులను పరిశీలిస్తున్న సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్

రుద్రంగి, మే 21(ఆంధ్రజ్యోతి) : భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ అన్నారు. జిల్లాలో భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా రుద్రంగి మండలాన్ని ఎంపిక చేశారు. దీంతో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ సందర్శించారు. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి, రైతుల నుంచి స్వీకరించిన దరఖస్తులను పరిశీలించి వివరాలను అడిగితెలుసుకున్నారు. భూ భారతిలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి చేశారని తహసీల్దార్ పుష్పలత తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామస్థులు ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి

**- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ**



ప్రొసీడింగ్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులు ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యపడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం పత్తికుంటపల్లె గ్రామంలోని ఫంక్షన్ హాల్‌కు నిధుల మంజూరు పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలో జరిగే శుభకార్యాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని మిగులు పనుల కోసం డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ 30లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏలేటి మాధవరెడ్డి, బోడ శ్రీనివాస్‌రెడ్డి, ఏగుర్ల మల్లయ్య, తిరుపతి, నవీన్, చింతలపెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం



డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై అంజయ్య

చందుర్తి మే 21(ఆంధ్రజ్యోతి): డీజీపీ జితేందర్ చేతుల మీదుగా చందుర్తి ఎస్ఐ బి అంజయ్య ప్రశంసాపత్రంతో పాటు క్యాష్‌రివార్డును బుధవారం అందుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారం చేసి జిల్లాలో చందుర్తి ఎస్సై అంజయ్య ప్రథమ స్థానం, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారు. కేసుల పరిశోధనలో పురోగతి సాధించి డీజీపీ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడంపై ఎస్పీ మహేష్ బి గితే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లులు ఎస్సై అంజయ్యను అభినందించారు.

## డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు**




మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో 17 నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయలేని దయనీయమైన పరిస్థితులలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు కాళేశ్వర్యం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాంలోపాలు, అవకతవలపై విచారణకు రావాలంటూ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నోటీసులు పంపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. దాని కాలపరిమితి పూర్తి అయిందని కేసీఆర్‌తో పాటు హరీష్‌రావు ఇతరులను ఎవరిని కూడా విచారణ చేసే పరిస్థితులు లేవని కమిషన్ రిపోర్టు పంపిస్తుందనే మాట చెప్పడం జరిగిందన్నారు. చెప్పిన ఒక్కరోజులోనే ప్రభుత్వం జీవో ఇచ్చి వాళ్లకు నోటీసులు ఇప్పించడను ప్రజలు గమనించాలన్నారు. కమిషన్ చాలా మందిని విచారణ జరిపి సమాచారం తీసుకోవచ్చని కానీ దోషులుగా ఏ రకంగానైనా వీరిని చూపించాలని చిత్రీకరించాలని కుటిలమైన ఆలోచన ఈ ప్రభుత్వంకు ఉందని ఆరోపించారు. ఈ 17 నెలలకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని, ఈ ప్రభుత్వంలో అంతా కరెప్షన్ మంత్రులేనని ప్రజల్లో పేరుకు పోయిందన్నారు. ఒక మంత్రి మాట్లాడుతూ అందరు మంత్రులు డబ్బులు తీసుకొని పని చేస్తున్నారని తాను డబ్బులు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పడం ద్వారానే ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో తేటతెల్లమైందన్నారు. సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కాళ్లేశ్వరం ప్రాజెక్టు ద్వారా కరువు లేకుండా ముందుకు తీసుకెళ్లాడని అన్నారు. కేసీఆర్‌ను దోషిగా నిరూపించాలని, ఆయన చేసిన పనులు కూడా తప్పని చెప్పడానికి మాత్రమే కుంగిన పిల్లర్లను ఈ ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో ఎన్ని పొలాలు ఎండిపోయాయి, ఎంత కరువు వచ్చిందో ప్రజలు గమనించాలన్నారు. గతంలో ఇంత దిగజారిన రాజకీయం ఎప్పుడు ఎవరు చేయలేదన్నారు. ప్రజలను పక్కదారి పట్టించాలని ఆలోచనతో ఈ కమీషన్లు, కమిటీలతో ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుసేన్‌సాగర్‌ను ప్రక్షాలన చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు మరొక మార్గంలో నీటి తీసుకెళ్తామని చెప్పడం జరిగిందని అది కేసీఆర్ కట్టిన కాళ్లేశ్వరం ప్రాజెక్టు ద్వారానే హైదరాబాద్‌కు నీళ్లు తీసుకెళ్లాల్సి ఉంటుందని మరో మార్గం లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి కేసీఆర్‌ను బదనాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ ఎంపీపీ గజబీంకార్ రాజన్న, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకుడు కుంభాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

**- టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్**

సిరిసిల్ల రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ పాఠశాలలో బుధవారం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక, ఇళ్లు కట్టులేక తీవ్రమైన ఇబ్బందులతో అత్మక్షోభకు లోనై కన్నీటి పర్యంతమైతున్నారన్నారు. సప్లమెంటరీ సరెండర్ బిల్లులు, మెడికల్, జీపీఎఫ్‌ఫైనల్ పేమెంట్, టీజీ ఎల్ఐ, పార్ట్ ఫైనల్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం వలన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ ఏరియర్స్, గ్రాట్యూటీ ఇతర రకాల చెల్లింపులకు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారన్నారు. అకాల మరణం చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల మరణాంతర ఆర్థిక చెల్లింపుల కోసం వారి కుటుంబీకులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు రెంటాల రమణారెడ్డి, వేములవాడ మండల అధ్యక్షుడు కోల వినయ్, కోనరావుపేట మండల అధ్యక్షుడు గాజ్జెంగి విష్ణు, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు పచ్చిమట్ల అనిల్ కుమార్, జీవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

**- నేటి నుంచి పరీక్షలు - సీసీ కెమెరాల నిఘా.. 144 సెక్షన్ అమలు**

**- జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు.. 3,863 మంది విద్యార్థులు**

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ఉన్నత చదువులకు వెళ్లే దిశగా అడ్వాన్స్‌డ్ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 పరీక్ష కేంద్రాల్లో 3,863 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించి ఒకేరోజు రెండు సెక్షన్లుగా నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. దాదాపు గంట ముందు నుంచి పరీక్ష కేంద్రలోకి అనుమతిస్తారు. విద్యార్థులు ముందుగానే ఓఎంఆర్ పత్రాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎవరికి వారు తమకు ఇచ్చిన పత్రంపై తమ వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని సరిచూసుకోవాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ముందే కేంద్రాలకు చేరుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### నిఘా నీడలో పరీక్షలు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సీసీ కమెరాల నిఘాలో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నారు. మే 22 నుంచి మే 29 వరకు థియరీ పరీక్షలు జూన్ 3 నుంచి 12 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. గురువారం నుంచి జరిగే ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమల్లో ఉంచారు. వంద మీటర్ల దూరం వరకు నిషేదాజ్ఞలు పరీక్ష సమయంలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసివేయించనున్నారు. ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరాల వద్దనే తెరవనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. చేతిగడియారాలు కూడా అనుమతి లేదు. ఇన్విజిలేటర్ ప్రతి 30 నిముషాలకు సమయాన్ని తెలియజేస్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పరీక్షల నిర్వహణకు 270మంది సిబ్బందిని నియమించారు. 13మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 13మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ముగ్గురు కస్టోడీయన్‌లను నియమించారు. 200 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారు. వేసవి ఉండడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా మంచీనీటి సౌకర్యం, ఓఆర్ఆర్ ప్యాకేట్లు వంటివి అందుబాటులో ఉంచారు.

### జిల్లాలో 3,863 మంది విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 కేంద్రాల ద్వారా ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష రాయడం పూర్తి చేసినా పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే బయటకు పంపిస్తారు. ఇతర గ్రామాల నుంచి పరీక్షలకు వచ్చే విద్యార్థుల కోసం బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు 3,863 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,385 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు 1,478 మంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులను తనిఖీ చేసిన అధికారులు 6

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం - కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం 8

# నెలరోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ**



ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు నెల రోజుల్లోపు ప్రారంభించి వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తంగళ్లపల్లి మండలంలో రెండో విడతలో 500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇంచార్జీ కెకె మహేందర్ రెడ్డిలు ఆందజేశారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో రెండో విడత 500 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందజేస్తున్నమని అన్నారు. లబ్ధిదారులకు నాలుగు దశల్లో రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మింట్ నిర్మాణం పూర్తవ్వగానే లక్ష రుపాయాలు, గోడలు నిర్మిస్తే లక్ష, స్లాబ్ నిర్మాణం చేపడితే రూ, 2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం గూర్చి అధికారులు, దళారుల పైరవీలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిదులు మంజూరు చేస్తుందన్నారు. నిబంధనలకు ప్రకారం అధికారుల సూచన మేరకు 400పీట్లు తగ్గకుండా 600పీట్లు దాటకుండా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తుందని, ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దశల వారిగా మొత్తం 10 ట్రిప్పుల ఇసుకను ఉచితంగా అందిస్తామని.. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఉచితంగా ఇసుకను అందివ్వాలని తహసీల్దార్‌ను సమావేశంలోనే ఆదేశించారు. 30 రోజుల్లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మంజూరైన ఇళ్ల రద్దు అయ్యే అవకాశ ఉంటుందని లబ్ధిదారులు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేకాధికారి షరీఫుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

**- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి**

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తంగళ్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కలెక్టర్, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామన్నారు. రుణ సదుపాయం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన ఇండ్ల నిర్మాణాలు సౌకర్యాలు లేక ఇండ్లలో ఉండడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి స్వంత ఇంటి కలను నేరవేరుస్తుందన్నారు. అర్హులైన వారందరికి ఇళ్లు వస్తాయని ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జల్గం ప్రవీణ్, లింగాల భూపతి, సుద్దాల శ్రీనివాస్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, మునిగెల రాజు, ఆరెపెల్లి బాలు, పొన్నాల పర్శరాములు, తిరుపతిరెడ్డి జుపెల్లి రాజేశ్వర్‌రావ్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దారులన్నీ కొండగట్టుకే..



- తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు
- రెండో రోజు వైభవంగా ఉత్సవాలు
- నేడు హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షా పరుల సంకీర్తనలతో, భక్తుల జై హనుమాన్ ఘోషతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం పులకిస్తోంది. రామనామ సంకీర్తనలతో అంజన్న పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండిపోతున్నాయి. రామదండును తల పించేలా భక్తులు కొండగట్టుకు వస్తుండగా ఆలయం కాషాయ వర్ణంతో కళకళలాడుతోంది. మంగళవారం నుంచి ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలతో బుధవారం రాత్రి కొండంతా భక్తజన శోభితంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా దీక్షాపరులు కాలి నడకన, వాహనాల్లో కొండపైకి చేరుకుని మాల విరమణ చేస్తున్నారు.

### వైభవంగా జయంతి ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం యాగశాలలో వేద పండితులు, అర్చ కులు స్థాపిత దేవతారాధన, హోమం, సుందరకాండ పారాయణం, పంచామృత అభిషేకం, సహస్ర నామా ర్చన, విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ అమ్మవారి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు తిరుక్కోవెల కపీందర్, ప్రధాన అర్చకు లు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు, ఉప ప్రధాన ర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ పర్య వేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్, అర్చకు లు తదితరులు పాల్గొన్నారు. సాయం కాలం ఆలయ ఆవరణలో కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తలదాచు కోవడానికి పాట్లు పడ్డారు. మాల విరమణ, దర్శనం కోసం బారులు తీరారు.

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి త్రైయా హ్నిక త్రికుండాత్మక యజ్ఞాన్ని నిర్వహించడం సంప్రదా యంగా వస్తోంది. ఈ సందర్భంగా వేలాది దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు కొండగట్టుకు తరలివస్తు న్నారు. మంగళవారం నుంచి ఆలయం ముందు గల యాగశాలలో త్రైయాహ్నిక ఉత్సవాల యాగంను మహా వైభవంగా నిర్వహిస్తుండగా గురువారం వైశాఖ బహు ళ దశమి రోజున హనుమాన్ జయంతి నిర్వహిం చనున్నారు.


యాగం నిర్వహిస్తున్న అర్చకులు


కొండగట్టులో మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు, ఆలయ ఆవరణలో దీక్షాపరుల సందడి

# పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం



### దరఖాస్తు చేసుకునే విధానం

మీసేవా కేంద్రాల ద్వారా టీఎస్ ఈ పాస్ పోర్టల్లో telanganaepass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలు, పదో తరగతి మార్కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, నాలుగు నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టి ఫికెట్లు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువపత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షలకు మించరాదు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం 36 వేల రూపాయల ప్రోత్సాహకం అందించనుంది..

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్యచాలా కీలకమైనది. చాలామందికి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్య అభ్యసిం చాలనే కోరిక ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ విద్య పేదలకు అందని ద్రాక్షగా మారింది. ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్పొరేట్ విద్యా పథకాన్ని తీసుకొచ్చింది. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈ పథకం ద్వారా తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఈ పథకానికి సంబంధించి 2025-26 విద్యా సంవత్స రానికిగాను దరఖాస్తుల స్వీక రణ ప్రక్రియ ప్రారంభ మైంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభు త్వం ప్రోత్సాహకం అందించనుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నాలుగు వందలకుపైగా మార్కులు సాధించిన ఎస్సీ ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెం దిన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థులు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత, ఎయిడెడ్, కస్తూర్బా, నవోదయ, గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎంపికైన విద్యార్థు లకు కళాశాలతో కూడిన సమాచారం అందిస్తారు.

### పేద విద్యార్థులకు ఉపయోగకరం

**పి పవన్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి**



కార్పొరేట్ విద్యా పథకం ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలి. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లపాటు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య, వసతి కల్పిస్తారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హుజూరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్‌బ్యాంక్ ఉద్యోగి ద్విచక్రవాహనంపై అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఓ టిప్పర్‌లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చౌరస్తా వద్ద ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## గుడి చెరువులో రెండు మృతదేహాలు లభ్యం

వేములవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లజిల్లా వేములవాడ గుడిచెరువులో బుధవారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఇద్దరు మగవారి మృతదేహాలను గుడి చెరువులోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గుడి చెరువులో రెండు మృతదేహాలను గుర్తించి వెలికితీశామని ఆయన తెలిపారు. మృతుల్లో ఒకరు 55-60 సంవత్సరాలు, మరొకరు 35-40 సంవత్సరాల వయసు ఉన్నట్లు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాల వద్ద వారి చిరునామా, ఇతర వివరాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, రెండు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు వేరు వేరు సమయాల్లో మృతిచెందినట్లు తెలుస్తోందని, మరణానికిగల కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదన్నారు. ఆచూకీ తెలియని వ్యక్తులకు సంబంధించిన బంధువులు మృతదేహాలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో పరిశీలించవచ్చని తెలిపారు.

## ఎస్సారెస్పీ కాలువలో..

మానకొండూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలోగల ఎస్సారెస్పీ ప్రధానకాలువలో బుధవారం కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో లభ్యమైన మృతదేహం మూడు నుంచి నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని తెలిపారు. ఇతను బీహార్ లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వలస కూలీ అయి ఉండొచ్చన్నారు. వయస్సు 30 నుంచి 35గా ఉన్నట్లు తెలిపారు. గ్రామ కారోబార్ ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడు మృతి


బాలరాం (ఫైల్)

ముస్తాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌గ్రామానికి చెందిన పెద్దూరి బాలరాం (50) అనేగీత కార్మికుడు కల్లుగీసేందుకు వెళ్లి చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామశివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గీతకార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీపీఏసీఎస్ ఛైర్మన్ బొందుగుల దేవిరెడి, మాజీ సర్పంచ్ యారటి లక్ష్మీ, గాంత రాజులు కోరారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి


మానస (ఫైల్)

మల్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజరం గ్రామంలో బుధవారం డిష్ తీగలు ఓ మహిళ ప్రాణాలు తీశాయి. బట్టలు ఆరవేస్తూ విద్యుదాఘాతంతో శీలం మానస(30)అనే మహిళ మృతిచెందింది. ఇంట్లో బట్టలు ఆరవేస్తుండగా పక్కనే డిష్ బాక్స్‌కుచెందిన తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో మానసను చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డిష్‌బాక్స్‌ను తొలగించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని డిష్ నిర్వాహకులపై మృతురాలి తల్లి అవారి మల్లీశ్వరి పోలీసులకు ఫిర్యాదుచేసింది. మానసకి భర్త, కొడుకు, కూతరు ఉన్నారు. భర్త సంతోష్ మంగళవారమే ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగ సంతోష్ మళ్లీ తిరిగివస్తుండడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో పేకాట ఆడుతున్న 13మందిని కొత్తపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. రేకుర్తిలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి ఏఎస్సై పోచయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3లక్షల65వేల నగదు, 14సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారికి నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

# ‘జెమ్’తో అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం

- బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి
- విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ


యోగా చేస్తున్న అమ్మాయిలు


కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక వికాసానికి ఎన్టీపీసీ కృషి చేస్తున్నది. ప్రధానంగా ప్రభావిత ప్రాంతంలో విద్యాభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) పథకం కింద నిధులు కేటాయించి వివిధ పనులకు వినియోగిస్తోంది. దీనిలో భాగంగానే ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు బాలికాసాధికారతకు ఎన్టీపీసీ చేయూతనందిస్తోంది. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్(జెమ్) పేరిట చుట్టుపక్కల సర్కారు బడుల్లో 8వ తరగతి చదువుతున్న 120 మంది బాలికలకు నెలరోజులపాటు ప్రత్యేక వర్క్‌షాప్(శిక్షణ) నిర్వహిస్తోంది. ఏడవ తరగతి పూర్తయి 8వ తరగతికి వచ్చిన 120 మంది విద్యార్థులను ఎన్టీపీసీ ఎంపిక చేసింది. ఈ నెల 6న ప్రారంభమైన జెమ్ వర్క్‌షాప్‌లో వీరికి వివిధ సబ్జెక్టులతో పాటు ఇతర రంగాలలో తర్ఫీదునిస్తున్నారు. భువనేశ్వర్‌కు చెందిన తన్వీ కన్సల్టెన్సీ సంస్థ సహకారంతో 28 రోజుల పాటు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణనిస్తున్నారు. 2019 నుంచి ప్రతిఏటా జెమ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు.

### చదువుతోపాటు స్వీయ రక్షణలో శిక్షణ

జెమ్‌లో భాగంగా బాలికలకు చదువుతో పాటు స్వీయరక్షణ, ఇతరఅంశాలలో శిక్షణ నిస్తున్నారు. తెలుగు,హిందీ,ఇంగ్లీషు, మ్యాథ మెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో బోధిస్తున్నారు. అలాగే సెల్ఫ్ డిఫెన్స్‌లో భాగంగా కరాటే నేర్పిస్తున్నారు. యోగా, చిత్రలేఖనం, హస్తకళల్లో ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. సాంస్కృతిక అంశాలలో భాగంగా నృత్యం నేర్పిస్తున్నారు. కంప్యూటర్స్‌లో ప్రాథమిక అంశాలను(బేసిక్స్) విద్యార్థినులకు నేర్పిస్తున్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించడం జంకులేకుండా ఉపన్యాసం ఇచ్చేలా తర్ఫీదునిస్తున్నారు. తాము జీవితంలో ఏమి కావాలనుకుంటున్నారో నిర్ణయించుకునేలా మోటివేషన్ క్లాసులు ఇప్పిస్తున్నారు.

ఉదయంనుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణ పొందుతున్న బాలికలకు వసతితోపాటు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటీన్ నిర్వహిస్తున్న ఐసీహెచ్(ఇండియన్ కాఫీ హౌజ్) సంస్థ విద్యార్థినిలకు రుచికరమైన భోజనం, అల్పాహారం అందిస్తోంది.

### శిక్షణ ఎంతో ఉపకరిస్తోంది..

**- జి.గాయత్రి, మొఘల్‌పహాడ్**



జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. చదువు సంబంధ సబ్జెక్టులతోపాటు మాకు ఇతర అంశాలను నేర్పిస్తున్నారు. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. జెమ్‌లోనృత్యంలో నాకు సోలో, గ్రూప్ డ్యాన్స్ నేర్పిస్తున్నారు.

### మ్యాథ్స్‌లో శిక్షణ ఇస్తున్నారు..

**- స్వాతి, దుర్గయ్యపల్లి జెడ్పీస్కూల్**



నాకు లెక్కల సబ్జెక్టు అంటే ఎంతో ఇష్టం. మ్యాథ్స్‌లో ప్రత్యేకశిక్షణ ఇస్తున్నారు. గతంలో కన్నా ఇప్పుడు లెక్కలు సులువుగా అర్థమవుతున్నాయి, చేస్తున్నాను. మిగతా అంశాలు యోగా, డ్రాయింగ్‌లో శిక్షణతో వాటిపై ఆసక్తి పెరిగింది.

### జెమ్ భవిష్యత్‌కు దిక్సూచి

**- ఎం.వామిక, గాంధిపార్క్ జెడ్పీ స్కూల్**



జెమ్ శిక్షణ నా భవిష్యత్‌కు దిక్సూచి లాంటింది. నాకు ఇంగ్లీషు సబ్జెక్టు అంటే ఇష్టం. కానీ మాస్కూల్లో అంతబాగా నేర్చుకోలేకపోయాను. జెమ్‌లో టీచరు ప్రత్యేకంగా ఇంగ్లీషు బోధిస్తున్నారు. సులువుగా అర్థమయ్యేలా చెబుతున్నారు.

### సాధికారత, డ్రాపౌట్లు తగ్గించేందుకు

**- విజయ్ కుమార్ సిక్దర్, హెచ్‌వోడీ(హెచ్ఆర్)**



ప్రభావిత ప్రాంతంలోని బాలికల సాధికారత, అమ్మాయిల డ్రాపౌట్లు తగ్గించడంలో జెమ్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో జరిగిన నాలుగు జెమ్ వర్క్‌షాప్‌లలో శిక్షణ పొందిన విద్యార్థినుల్లో మెజారిటీ విద్యార్థినులు మంచి కెరీర్‌ను ఎన్నుకొని ముందుకు నడుస్తున్నారు. సామాజిక బాధ్యతగా జెమ్ నిర్వహిస్తు న్నాం. భవిష్యత్‌లో బాలికల అభ్యున్నతి కోసం జెమ్‌తోపాటు సీఎస్ఆర్ పథకం కింద ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తాం.

## వృత్తి నైపుణ్య శిక్షణ

తిమ్మాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో చదివి, ఉద్యోగం రాని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రానివారు ఉంటే వారికి ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధిపొందేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వచొరవతో ఉన్నతిఫౌండేషన్ ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. 19నుంచి 25ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వవిద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గౌలిదొడ్డి కళాశాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల తనిఖీ


వివరాలను తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని కొనుగోలు కేంద్రంతోపాటు పలుగ్రామాల్లోని రైస్‌మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు లక్ష్మారెడ్డి, జంగయ్య బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతుల వివరాలను, ధాన్యం నాణ్యతలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యంకొనుగోలు చేయాలని సూచించారు. రైస్‌మిల్లులలోని దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలను పరిశీలించారు. ధాన్యంకొనుగోలు, రైస్‌మిల్లుల్లోని ధాన్యం నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీటీసీఎస్ అశోక్, ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం తదితరులు ఉన్నారు.

## ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని పట్టుకున్నామని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. బండలింగంపల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ అల్లెపు వంశీకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మండలంలోని పదిర గ్రామ శివారు మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాజన్నపేటలోని వాహన డ్రైవర్ శివరాత్రి నర్సయ్య సూచన మేరకు పికప్ వాహనంలో ఇసుకను తరలిస్తు పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి డ్రైవర్ వంశీకృష్ణను అరెస్ట్ చేశామని వెల్లడించారు. యజమాని నర్సయ్య పరారీలో ఉన్నాడని వివరించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ హెచ్చరించారు.

## చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

కోల్‌సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే సింగరేణి కార్మికుడు మంకిడి సాంబమూర్తి(53) ఈనెల4న ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సాంబమూర్తి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించగా మనస్తాపానికి గురై 4వతేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. సింగరేణి ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. అతనికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

# పంటల వైద్యుడు ‘ప్లాంటిక్స్’ యాప్

- రైతుల కోసం రూపొందించిన ఇక్రిశాట్




చొప్పదండి, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులకు సాగులో సహాయం చేస్తుంది ‘ప్లాంటిక్స్’ యాప్. పలు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా రైతుల 35 రకాల పంటల సమాచారం అందుతుంది. రైతుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కమ్యూనిటీ ఫీచర్ అందుబాటులో ఉంది. జర్మనీకి చెందిన సంస్థ ఇక్రిశాట్ భాగస్వామ్యంతో ఈ ప్లాంటిక్స్ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారంగా రైతులకు ఈ మొబైల్ యాప్ సలహాలు, సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతుంది.

### పంటల సాగులో సలహాలు, సూచనలు

రైతులు పంటల కోసం రూపొందించిన యాప్ వైద్యుడిగా పేరొందింది. పంటల్లో చీడపీడలు, తెగుళ్లు, వ్యాధులను గుర్తించి వెంటనే రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుంది. పరిష్కార మార్గాలను తెలుపుతూ, వ్యాధుల నివారణకు మందులను ప్రతిపాదిస్తుంది. రైతులకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో నెలకొన్న వాతావరణ సమస్యలు, భూసారంలో లోపాలను యాప్ ఏఐ సహకారంతో గుర్తిస్తుంది. మొక్కలకు అందించాల్సిన పోష విలువలను, ఎరువుల వాడకాన్ని సూచిస్తుంది. అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తల సలహాలను కూడా పొందవచ్చు.

### పంట ఫొటోలు అప్‌లోడ్ చేయాలి...

రైతులు తమ పంటలో తెగుళ్లు, పోషక లోపాలు, వ్యాధులకు సంబంధించిన ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. వెంటనే పురుగులను, సమస్యను గుర్తించి పరిష్కార మార్గాన్ని చూపుతుంది. 30 ప్రధాన పంటలకు సంబంధించిన 780 రకాల వ్యాధులు, తెగుళ్లను యాప్ గుర్తించి సలహాలు, సూచనలు ఇస్తుంది. ఈ యాప్ 19 ప్రాంతీయ భాషల్లో సమాధానాలు ఇస్తుంది. యాప్ ద్వారా 500 మంది వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పొందవచ్చు.

రైతులకు తమ ప్రాంతాల్లో పంటలకు రాబోయే వ్యాధులు తెలుపుతూ హెచ్చరికలను కూడా ఈ యాప్ అందిస్తుంది. వాతావరణ సూచనలు, ఎరువుల వాడకాన్ని తెలియజేస్తుంది. భూమిలో పోషకాల లోపాలను గుర్తిస్తుంది. తద్వారా పంట నష్టాన్ని తగ్గించి, అధిక దిగుబడిని పొందవచ్చు. దీంతోపాటు రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంగా పనిచేస్తుంది. ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఉన్న ధరలను తెలుసుకోవచ్చు. ప్లే స్టోర్ నుంచి ప్లాంటిక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.





పుష్కరస్నానం ఆచరిస్తున్న ప్రజలు

# త్రిలింగ క్షేత్రం.. పుష్కర శోభితం

**ఏడోరోజు లక్ష మందికిపైగా పుణ్యస్నానాలు**

**అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు**

కాళేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రం.. కాళేశ్వరం పుష్కర శోభితమై వెలుగులీనుతోంది. వేలాదిగా తరలొస్తున్న భక్తజనంతో త్రివేణి సంగమం సందడిగా మారింది. సరస్వతి పుష్కరాల్లో ఏడో రోజైన బుధవారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో సరస్వతీ మాతకు చీర, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సంఖ్య రద్దీగా ఉండడంతో అధికార యంత్రంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్‌కు వెళ్లేందుకు అధిక సంఖ్యలో ఉచిత బస్‌లను అందుబాటులో ఉంచారు. అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి అన్నారం క్రాస్ రోడ్డు నుంచి పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండు వరకు ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. అకాల వర్షంతో రోడ్లన్నీ బురదమయమై భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**● పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు**

సరస్వతి పుష్కరాల్లో బుధవారం బెల్లంపల్లి శాసనసభ్యుడు, మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్‌ఖరే అంతర్వాహినిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.




గోదావరి వద్ద పూజలు
గోదావరికి ఎడ్ల బండ్లలో వస్తున్న భక్తులు

## 24న ఉమ్మడి జిల్లా అండర్-11 చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-11 బాల బాలికల చదరంగ పోటీలను ఈ నెల 24వ తేదీన కరీంనగర్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీలో ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2015 తర్వాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలలోపు 9390177607 నంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## డిగ్రీ పరీక్షల్లో 19 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్ ప్రాక్టీస్ చేసిన 19 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్‌లో శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, మహదేవపూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో 16 మందిని డీబార్ చేసినట్లు వివరించారు.

## మామిడి లారీ బోల్తా

జగిత్యాల అగ్రికల్చర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున మామిడి లారీ బోల్తా పడింది. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ఖమ్మం నుంచి ఢిల్లీ వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన మామిడి లారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికుడు సుమేరుద్దీన్ ఆజాద్ 108 వాహనంతో పాటు పట్టణ పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ డ్రైవర్, క్లీనర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## అనాథ యువతి పెళ్లి పెద్దగా కలెక్టర్

**● అంగరంగ వైభవంగా మానస వివాహం**

**● హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు**

పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే తల్లితండ్రులను కోల్పోయిన మానసతో పాటు తన చెల్లెలు లక్ష్మి పదహారేళ్ల క్రితం ఒక బాలల సంరక్షణ కేంద్రానికి చేరారు. ఆశ్రమ నిర్వాహకులు వారిని పెంచి పెద్ద చేశారు. ఉన్నత చదువులు చదివిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన నక్క మానసకు పెళ్లి కుదిరింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష పెళ్లి పెద్దగా నిలిచి మానసకు అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో గల తబిత బాలల సంరక్షణ ఆశ్రమంలో నక్క మానస, ఆమె చెల్లెలు నక్క లక్ష్మి పదహారేళ్లుగా ఆశ్రయం పొందుతున్నారు. వీరి తల్లితండ్రులు చిన్నపుడే మరణించడంతో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీస్ (ఐసీపీఎస్) అధికారులు వీరిని ఆశ్రమంలో అప్పగించారు. అప్పటి నుంచి తబిత ఆశ్రమం నిర్వాహకులు వీరేందర్ నాయక్, విమల దంపతులు వారికి తల్లితండ్రులు లేని లోటు తీర్చి తమ సొంత పిల్లలుగానే పెంచి పోషించారు.


టీఎన్జీవో నాయకులు అందజేసిన చెక్కును మానస దంపతులకు ఇస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

మానస కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యింది. మానస పెళ్లీడుకు రావడంతో పెళ్లి సంబంధాలు చూడడం ఆరంభించారు. జనగాం జిల్లా రఘునాథపల్లికి చెందిన మాస రేణుక, యాకయ్యల కుమారుడు మాస రాజేష్ ఎలాంటి కట్నకానుకలు లేకుండానే మానసను పెళ్లి చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. మానస పెళ్లి ఘనంగా జరిపించాలనే ఉద్దేశంతో ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్‌రావుకు ఆశ్రమ నిర్వాహకులు తెలియజేశారు. ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకవెళ్లారు. స్పందించిన కలెక్టర్ సొంత ఖర్చులతో పెళ్లి జరిపించేందుకు ముందుకు వచ్చి ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.


బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 11:05 గంటలకు పండితులు వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా మానస, రాజేష్‌ల వివాహం జరిపించారు. అంతకు ఒక రోజు ముందు రామగుండం తబిత ఆశ్రమంలో పెళ్లి కూతురును చేయడం, హల్ది, హిందూ సంప్రదాయం ప్రకారం ఆశ్రమం నిర్వాహకులు అన్ని వేడుకలు జరిపించారు. ఈ వివాహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమ శాఖాధికారి పి వేణుగోపాల్ రావు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఆశ్రమ నిర్వాహకులు కన్యాదానం చేశారు. ఈ పెళ్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అదనపు కలెక్టర్లు డి వేణు, జె అరుణశ్రీ, టీజీఓ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ తమ సంఘం తరపున 61,800 రూపాయల చెక్కును అందజేశారు. ప్రతి వివాహ వేడుక కు హాజరై వధూవరులను ఆశీర్వదించి కట్నాలు తీసుకునే ట్రాన్స్‌జెండర్లు ఈ వధూవరులకు బట్టలు పెట్టి 11 వేల కట్నం చదివించి ఆశీర్వదించారు. సాయంత్రం భరాత్ నిర్వహించి నవ వధూవరులను సాగనంపారు. తన తోబుట్టువు తనను వదిలి అత్తారింటికి వెళ్లడంతో లక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈ వివాహం వేడుకలను జరిపించడంలో తబిత ఆశ్రమ నిర్వాహకులతో పాటు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది చాలా శ్రమించారు.

## ఎన్టీపీసీ ప్లాంటులో ప్రమాదం..

**ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు**

జ్యోతినగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో కొమురయ్య, అంకూస్ అనే ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్టేజ్ 2 పరిధిలోని ప్రజర్ పార్ట్స్ విభాగం హెచ్ఎఫ్‌వో వద్ద పనిచేస్తుండగా పైపు పగిలి వేడి ఆయిల్ కార్మికులపై పడడంతో ఈ ప్రమాదం జరిగింది. కాలిన గాయాలైన ఇద్దరిని ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కొమరయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. లక్ష్మీపురానికి చెందిన కొమరయ్య, అన్నపూర్ణ కాలనీకి చెందిన అంకూస్‌లు ఫ్యాబ్ ఎరక్టర్స్ అనే కాంట్రాక్టు సంస్థలో పని చేస్తున్నారు. ప్రమాదంపై ఎన్టీపీసీ యాజమాన్యం విచారణ చేపట్టినట్లు సమాచారం.

# ప్రకృతి సంరక్షణతోనే జీవ వైవిధ్యం



**● కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ**

**○ సహజ వనరుల విధ్వంసంతో వినాశనం....**

**● నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం**

కరీంనగర్ అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి, మనిషిని రక్షించడం మానవత్వం. అదే జీవ వైవిధ్యాన్ని రక్షించి సంరక్షించడం దైవత్వం. జీవవైవిధ్యం ప్రకృతి ఇచ్చిన వరం. మానవుడి మనగడకు ఆధారం. దానిని కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యం. మానవుడు తన కార్యకలాపాలను ప్రకృతికి అనుకూలంగా మార్చుకుని జీవ వైవిధ్యం అంతరించకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలుష్య నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. సహజ సిద్ధ వనరులను ఎడాపెడా వినియోగిస్తూ విధ్వంసం



చేస్తుండడం జీవుల మనుగడకే ప్రమాదకరంగా పరిణమించింది. పర్యావరణ సమతుల్యతను కాపాడితేనే మానవ మనుగడకు అవకాశం ఉంటుంది. మనుషుల ప్రస్తుత జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చి విరివిగా రసాయనాల వినియోగం, ప్లాస్టిక్ వాడకం, చెట్ల నరికివేత, గుట్టల ధ్వంసం, వన్యప్రాణుల వేట వంటివి తగ్గించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని కాలుష్య నియంత్రణకు పాటుపడాల్సిన అవసరం ఉంది.

వనాలు, వన్యప్రాణులు, సహజసిద్ధమైన గుట్టలు, నదులపై మానవ మనుగడ ఆధారపడింది. అడవుల ధ్వంసం వల్ల గ్లోబల్‌వార్మింగ్ పెరిగిపోతున్నది. మరోవైపు విచక్షణారహితంగా వన్యప్రాణుల వేటతో ప్రతి రోజు 72 జీవ జాతులు, గంటకు మూడు వన్యప్రాణులు అంతరించిపోతున్నట్లు పలు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రకృతి సహజసిద్ధమైన వనరులను అవసరానికి మించి వినియోగిస్తుంటడంతో పర్యావరణం కలుషితమై భూతాపం పెరగడం మూలంగా సున్నితమైన కొన్ని జీవజాతులు అంతరించిపోతున్నాయి. అడవులు రోజు రోజుకు తరిగి పోవడంతో వన్యప్రాణులు ఆవాసం కోల్పోయి, ఆహారం లేకుండా అంతరించేస్థాయికి చేరుకుంటున్నాయి. పులులు, సింహాలతో పాటు మరి కొన్ని అరుదైన ప్రాణులు అంతరించే స్థాయికి చేరుకున్నాయి. సహజ వనరులను మితంగా వినియోగించుకుని, పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ విచక్షణతో వ్యవహరించినప్పుడే జీవవైవిధ్యం సురక్షితంగా ఉంటుంది. అప్పుడే సమస్త జీవులు మనుగడను సాగిస్తాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూతాపం పెరిగి ప్రకృతిలో పెనుమార్పులు సంభవిస్తాయి. దీంతో అతివృష్టి, అనావృష్టి ఏర్పడి తాగు, సాగునీటికి కటకట, పశుగ్రాసం లేక ఇబ్బందులు ఏర్పడుతాయి. భూమిలోని 84 లక్షల జీవరాశుల్లో ప్రస్తుతం 24 లక్షల జాతులు మాత్రమే జీవించి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

### జీవవైవిధ్య రక్షణకు..

- జంతువుల, పక్షుల ఆవాసాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- రోడ్లకిరువైపులా పండ్లు, కలపనిచ్చే చెట్లను విరివిగా పెంచాలి.
- అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం తాగునీటి తొట్లు, చెక్ డ్యాంలు నిర్మించాలి.
- సామాజిక అడవులను ప్రోత్సహించాలి.
- రైతులు ప్రకృతి వ్యసాయాన్ని అనుసరించాలి. కృత్రిమ ఎరువులు, రసాయనిక పురుగుల మందులను ఉపయోగించకుండా అవగాహన కల్పించాలి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి.
- వన్యప్రాణులను పరిరక్షించాలి
- జీవవైవిధ్యం రక్షణపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

### ప్రకృతి హితంగా భారతీయత...

భారతీయ సంస్కృతిలో ప్రతి చిన్న ఆచారం ప్రకృతిహితంగానే ఉంటుంది. వ్యవసాయంలో ఏ విధమైన హైబ్రిడ్, బీటీ విత్తనాలు ఉండేవి కావు. రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకునేవారు. పశువుల పేడను ఎరువుగా ఉపయో గించేవారు. రైతు పండించిన పంట ఇంటికి రాగానే కొంత పిచ్చుకల కోసం సింహద్వారానికి ప్రత్యేకంగా కట్టి ఆహారంగా అందించేవారు. రసాయనాలు వాడనందున పొలంలో రకరకాల మిత్ర జీవాలు ఉండేవి.

ఇది ప్రకృతి వ్యవసాయం. జీవవైవిధ్యాన్ని కాపాడే అచ్చమైన భారతీయ వ్యవసాయ పద్ధతి. ఈ విధానంలో పూసిన పుష్పాలు కూడా మూడు రోజుల వరకు వాడిపోవు. పరిస్థితులు మారాయి. అధిక శాతం రైతులు హైబ్రీడ్ విత్తనాలు, నసాయన పురుగు మందులు, ఎరువులు ఉపయోగిస్తున్నారు. భూమిని రసాయన ఎరువులతో నింపుతున్నారు. ఇప్పుడిప్పుడు కొంత మంది రైతులు భారతీయ వ్యవసాయ విధానంపై దృష్టి మరల్చి మళ్లీ జీవవైవిధ్యాన్ని రక్షించే ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు.

### నేపథ్యం....

1992లో రియోలో అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పర్యావరణ సదస్సులో జీవ వైవిధ్య ధ్వంసంపై ఆందోళన వ్యక్తమైంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలని 150 దేశాలు తీర్మానిస్తూ సంతకాలు చేశాయి. ప్రతి సంవత్సరం మే 22న ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించాలని తీర్మానించి అప్పటి నుంచి అమలు చేస్తున్నారు. 2010 సంవత్సరాన్ని జీవ వైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2012లో హైదరాబాద్‌లో జీవవైవిధ్య సదస్సు నిర్వహించగా 193 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము, పామును తిని గద్ద జీవిస్తుంది. గద్ద మరణించాక దానిని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా జీవవైవిధ్య చక్రం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా చక్రంలోని మిగతా అన్ని ప్రాణులపై ప్రత్యక్షంగా తీవ్రప్రభావం ఉంటుంది. మిగతా ప్రాణులపై పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా విశ్వంలో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనుషులు ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది. ఏ ఒక్క జీవి అంతరించినా అది మాన మనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 వేల జాతుల జీవరాశులు అంతరించిపోతున్నాయి. వరాశుల్లో ఏ ఒక్కటి అధికం, ఏ ఒక్కటి తక్కువ కాదు. ఒకదానిపై ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి.






## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి కాలం సెలవుల దృష్ట్యా రోజుకు రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి మరింతగా పెరుగుతోంది. బుధవారం ఉదయాన్నే భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి, కోడెమొక్కు క్యూలైన్లు, ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకొని పార్వతి రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాలు కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి హనుమాన్ భక్తులు తరలివచ్చారు.రాజన్నను దర్శించుకుని కొండగట్టు బయలుదేరారు.

## తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం

**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు**

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుండటంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు అనేకసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, కనీసం ముందస్తు సమాచారం సైతం ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతోంది. ఏమాత్రం గాలివీచినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. పక్కనున్న గ్రామాల్లో కొన్నిసార్లు విద్యుత్ సరఫరా ఉంటుండగా, ఇల్లంతకుంటలో మాత్రం నిలిచిపోతోంది. వేళాపాలాలేని విద్యుత్ కోతల వల్ల నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెస్ పాలకవర్గం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వినియోగదారులు పేర్కొంటున్నారు.

## ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత రాణించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని పాఠశాలలో అమలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు సందీప్‌రెడ్డి, హరీందర్‌రెడ్డి, రమేష్, బ్రహ్మచారి, రమేష్, శ్రీనివాస్, రాజు, అరవింద్, రమేష్‌లతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందిస్తామని భరోసా కల్పించాలి

కోనరావుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని పిల్లల తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని కోనరావుపేట మండల ఎంఈవో మురళి నాయక్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు నిర్వహించే వృత్యంతర శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు పునరంకితం కావాలన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, నాణ్యమైన చదువుపై మాత్రమే వారి జీవితాన్ని మార్చుకొనే అవకాశం ఉందని అన్నారు. చదువుతోనే మంచి జీవితం లభిస్తుందని భరోసా కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని అన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయని ఎంఈవో కృష్ణహరి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వృత్తాంతర శిక్షణను పొంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కనీస సామర్థ్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్‌పీలు తిరుపతి, సతీష్, ప్రశాంత్, రమేశ్, పూర్ణచందర్, భూమేశ్, ప్రవీణ్, శ్రీకాంత్ వ్యవహరించారు. సీఆర్పీలు రాజు, శ్రీనివాస్, ఉపేందర్, చంద్రయ్య, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవి లేని నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): అధికారిక కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించి ఏ పదవి లేని నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వుల పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ చిత్రపటాన్ని పెట్టకపోవడం శోచనీయమన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని పదవి లేని వారికి పెద్దపీట వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు శ్రీనివాస్, జబ్బార్, రాజం, మురళీమోహన్, సుధాకర్‌రావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీడు భూములను సస్యశ్యామలం చేసిన కేసీఆర్

**- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు**



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దం వేణు

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి) : బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీరు లేక వలసలు పోతున్న రైతుల కష్టాలను చూసిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించారని తెలిపారు. రైతులకు సాగునీరు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం చెందిన ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకే నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ఇల్లంతకుంట మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే మండుటెండలో మత్తళ్ళు దుంకిన విషయాన్ని రైతులు మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల్లో గుండెల్లో ఉన్న కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోరన్నారు. కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలు మానుకోకపోతే తెలంగాణ ప్రజలు తిరుగుబాట జెండా ఎగురవేస్తారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కదురు శేఖర్, నాయకులు బండారి మహేష్, గుంటి మధు, సిద్దం సాగర్, కోల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యులు ధ్రువీకరించిన మాంసాన్ని విక్రయించాలి

**- సీపీఐ నాయకుల వినతి**



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) పశువైద్యులు ధ్రువీకరించిన మేకల, గొర్రెల మాంసాన్ని విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని బుధవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. సిరిసిల్లపట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చాలా సంవత్సరాలుగా పశువైద్యుల ధ్రువీకరణ లేకుండా మేకలు, గొర్రెల మాంసాన్ని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. విక్రయదారులు చనిపోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న మేకలు, గొర్రెలను కోసి వాటి మాంసంను విక్రయిస్తున్నారన్నారు. చాలామంది విక్రయదారులు కోసిన మేక, గొర్రెల మాంసం అమ్మగా మిగిలితే ఆ మాంసాన్ని ఫ్రిజులో పెట్టి మరుసటి రోజు అమ్ముతున్నారన్నారు. మరికొందరు ఆడగొర్రెలను కోసి పొట్టేలు మాంసం అంటూ ప్రజలను మోసం చేస్తూ అధిక రేట్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. చాలా సంవత్సరాల క్రితం సిరిసిల్ల పట్టణంలో స్లాట్‌హౌస్‌లు నిర్మించినప్పటికి అక్కడ మేకలు, గొర్రెలు కోయకుండా విక్రయదారులు గృహాలలో అనారోగ్యంతో ఉన్న వాటిని కోస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం అడుతున్నారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాలో రూ. 600 లకు కిలో మాంసం ఉంటే సిరిసిల్లలో వ్యాపారులు సిండికేట్ అయి అధిక ధరలకు అమ్ముతున్నారని అడ్డగోలుగా పెంచిన మాంసం ధరలను అధికారులు నియంత్రించాలన్నారు. ఇప్పటికైనా స్లాటర్‌హౌస్‌లో పశువైద్యుల సమక్షంలో మేక,గొర్రెలను కోసి విక్రయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయం కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, నాయకుడు బూర్ల సందీప్ పాల్గొన్నారు.

# ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

**- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం - ఇబ్బందులు పడిన రైతులు**



వన్‌పల్లిలో తడిసిన ధాన్యం



ఎల్లారెడ్డిపేటలో తెగిపడ్డ విద్యుత్ వైర్లు



గంభీరావుపేటలో వైర్లపై పడ్డ రేకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలలో కురిసిన అకాలం వర్షం రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలం వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు, ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులకు ఎల్లారెడ్డిపేట మండలంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఉదయం నుంచి వాతావరణం మబ్బులుపడి చల్లగా ఉండడంతో రైతులు ధాన్యపు రాసులపై టార్పాలిన్ కవర్లు తీయలేదు. లారీలు రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు తరలించడం లేదన్నారు. మరోవైపు వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం కుప్పల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాల చుట్టూ వర్షపు నీరు చేరింది. ప్రధానంగా కొత్తపెల్లి కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కుప్పల్లోకి భారీగా వర్షం నీరు రావడంతో రైతులు ఆందోళన చెందారు. అదేవిధంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని సీతారాం బజార్ కల్లు దుకాణం రేకులు ఈదురు గాలులకు కరెంటు వైర్లపై పడ్డాయి. దీంతో కొద్దిలో పెద్ద ప్రమాదం తప్పింది. కరెంటు వైర్లు తెగితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని భావిస్తున్నారు. కల్లు దుకాణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభాన్ని తొలగించాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. మండల కేంద్రంలోని ఓడ్డెరకాలనిలో ఏర్పాటు చేసిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజుల కింద కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో సూమారు 5 లారీల ధాన్యం బస్తాలు అకాల వర్షానికి తడిసి పోయిందనిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం బస్తాలపై టార్పలిన్ కవర్లు కప్పినప్పటికి వర్షం వరద నీరు ధాన్యం బస్తాల కింది నుంచి ప్రవహించడంతో బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. లారీలు కొరత లేకుండా కొనుగోలు చేసిన ధాన్యంను వెంటవెంటనే తరలించాలని, అలాగే ధాన్యం కొనుగోల్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

● చందుర్తి : మండలవ్యాప్తంగా బుధవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. కొనుగోలు సెంటర్లో ఆరబోసిన ధాన్యం రైతులు అకాల వర్షంతో ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి. ఎండలతో సతమతమైన ప్రజలు ఒక్కసారి చల్లబడి ఉపశమనం లభించింది.



రుద్రంగిలో బస్తాలను ఆరబెడుతున్న రైతులు



ఎనగల్ గ్రామశివారులో రోడ్డుపై కూలిన వృక్షం



పిచ్చిమొక్కలతో నిండిన సబ్ సెంటర్

## విష సర్పాలకు నిలయంగా పల్లె దవాఖాన

వీర్నపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం వైద్యం కోసం వచ్చే పల్లె దవాఖాన పాములకు నిలయమైంది. చెట్లుపొదలు ఏపుగా పెరిగి పాములకు ఆవాసంగా మారాయి. నిత్యం రోగులు, వృద్ధులు, బాలింతలు, చంటి పిల్లలతో తల్లులు వస్తుంటారు. ఏ సమయంలో ఎక్కడనుంచి విష పురుగులు వస్తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పెరగడంతో దవఖాన ముందు నిల్చోవాలంటే జంకుతున్నారు. ఆసుపత్రి పరిసరప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను వేడుకుంటున్నారు.

## యాత్రను విజయవంతం చేయండి

చందుర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి): హిందూ ఏక్తాయాత్రను విజయవంతంచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22న కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక..

**- పేదలకు స్వయం సంఘాల ద్వారా రూ.లక్ష రుణం - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

ఎల్లారెడ్డిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : నీడ లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నెల రోజుల్లోగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలంలో రెండో విడత కింద మంజూరైన 643 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వు పత్రాలను స్థానిక ఓ ఫంక్షన్‌హాలు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంలతో కలిసి బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని అన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతవారిగా రూ.5 లక్షలను మంజూరు చేస్తోందనిన్నారు. ఇళ్ల నిర్మాణాలకు పెట్టుబడి లేని పేదలకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం అందిస్తామని అన్నారు. నెలరోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరైన ఇళ్లు రద్దు అయ్యే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తోందని, నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణంలో నిధుల మంజూరుకు లబ్ధిదారులు అధికారులు, దళారులను ఆశ్రయించవద్దని స్పష్టం చేశారు. నయా పైసా చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పనులను వేగవంతం చేసి ఇందిరమ్మ ఇంటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.



మంజూరు ఉత్తర్వు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కేకే మహేందర్‌రెడ్డి

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి

సిరిసిల్ల టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న రాజీవ్‌గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటి డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు, జగన్, ఏబీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కుడిక్యాల రవికుమార్, రాగుల జగన్, ఆడెపు ప్రభాకర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు రంగ కిషన్, నాలుక సత్యం, తాటికొండ శ్రీనివాస్, రాపెల్లి కళ్యాన్, గుండ్లపెల్లి గౌతమ్, శ్రీశైలం పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, సాహెబ్, బాబు, బాల్‌రెడ్డి, కిషన్, శ్రీనివాస్, రాజేందర్, కిష్టారెడ్డి, బాలయ్య, బుచ్చాగౌడ్, రాజునాయక్, రాములు, రాజు, రాజయ్య, మల్లారెడ్డి, రఫీక్, దేవయ్య, రవి, కిషన్, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, పర్శరాములు, నవీన్‌నాయక్, గోపాల్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, సోషల్‌మీడియా ఇంచార్జీ గౌరి శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, నాయకులు కూడెళ్ళి లక్ష్మన్, ఓరుగంటి నర్సింలు, అక్కపల్లి బాలయ్య, మోహన్, మహేందర్, రాజశేఖర్, ప్రసాద్, జంగ కాశీరాములు, ప్రశాంత్, లక్ష్మీనారాయణగౌడ్, బంగ్ల రాజు, బాబు, నాంపెల్లి, వినోద్, సురేష్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



గంభీరావుపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



సిరిసిల్లలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బోయినపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యం

● రుద్రంగి : మండల కేంద్రంలో బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, తర్రె లింగం, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, దయ్యాల శ్రీనివాస్, అక్కనపల్లి శ్రీనివాస్, సునిల్, దసారి గంగరాజం, పల్లికొండ వినయ్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలకేంద్రంలో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధం తిని నిర్వహించారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, పల్లె రవీందర్ రెడ్డి, బోర రవీందర్, లింబయ్య, ప్రభాకర్ మహమ్మద్ అజీం, రమేష్‌రెడ్డి, దేవ రాజు, ప్రదీప్, బండి ప్రభాకర్, పాతకాల ప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడు కలు మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. రూరల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేదురి రమేష్, నాయకులు పిట్టల వెంకటేష్, గుడిసె శంకర్, విష్ణు, ప్రవీణ్ వేల్పుల రాజు, సుధీర్,కమలాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎడమల ఆదిత్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : దేశానికి స్వర్గీయ రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరవలేనివని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యం పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సంభా లక్ష్మీరాజాం, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో రాజీవ్‌గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సింలు, మాజీ చైర్మన్ అంజనేయరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యాదగిరిగౌడ్, మిరియాల్‌కార్ శ్రీనివాస్; కొండం రాజిరెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, మిరుదొడ్డి భాను, బొప్ప నర్సయ్య, కిషన్‌రావు, పెద్దిగారి శ్రీనివాస్, ఉచ్చిడ బాల్‌రెడ్డి, రాంరెడ్డి, శీల ప్రశాంత్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

**- మీర్జా, ఎంపీవో, తంగళ్లపల్లి**



**ఆంధ్రజ్యోతి :** పన్నుల వసూళ్లు ఎలా ఉన్నాయి?

**ఎంపీవో:** గత ఏడాది వంద శాతం పన్నులు వసూలు చేశాం. కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని వసూలు చేస్తున్నారు.

**ఆంధ్రజ్యోతి :** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఎంపీవో:** పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. చెత్తచెదారం లేకుండా చూస్తున్నాం. వారంలో ఒకరోజు డ్రై డే తప్పనిసారిగా పాటిస్తూ పారిశుధ్యం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి :** కార్యదర్శుల కొరత ఉందా?

**ఎంపీవో:** మూడు గ్రామాలకు మినహా మండలంలోని 27 గ్రామపంచాయతీలకు కార్యదర్శులు ఉన్నారు. మెడికల్‌లీవ్‌లో ఉన్న ముగ్గురు కార్యదర్శుల స్థానాల్లో కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** ఇంటి అనుమతులు ఎన్ని రోజుల్లో ఇస్తున్నారు?

**ఎంపీవో:** ఇంటి అనుమతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాక పక్షంరోజుల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తాం. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటేనే ఇస్తాం లేకుంటే ఆన్‌లైన్‌లో ఎందుకు ఇవ్వడం లేదో నమోదు చేస్తాం.

- తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి)

## అందుబాటులో జీలుగ విత్తనాలు

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు ఉన్నట్లు వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30కిలోల బ్యాగ్‌కు రూ 2138 చెల్లించాలని, ఒక బ్యాగ్ విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చి టోకెన్లు తీసుకోవాలన్నారు.

## కొండగట్టుకు పాదయాత్ర

ఇల్లంతకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ మాలధారులు కొండగట్టుకు పాదయాత్ర చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల హనుమాన్ మాలదారులు ప్రతి సంవత్సరం కొండగట్టుకు కాలి నడకన వెళుతుంటారు. ఇల్లంతకుంటకు చెందిన 15మంది మాలదారులు బయలుదేరారు. వీరిలో మాజీసర్పంచ్‌లు మామిడి సంజీవ్, పోతరాజు పర్శరాం, నర్ర శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, హరికృష్ణ, ఒగ్గు మధు, దయ్యాల రామకృష్ణ, సుక్క బాబు, జనార్దన్, అజయ్, జక్కుల రాజు, జీవన్‌బాబు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## నిబంధనల్లో సడలింపు ఇవ్వాలి

చందుర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి): పేదలు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనలలో సడలింపు ఇవ్వాలని చందుర్తి మాజీ ఉప సర్పంచ్ చిర్రం తిరుపతి అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం విధించిన నిబంధనలలో మార్పులు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన పేద వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఇళ్ల మంజూరు పత్రంలో నిబంధనలు మార్పు చేయాలన్నారు.